ప్రజాశక్తి
మంగళవారం 8 అక్టోబర్ 2024
5
విజయనగరం

కార్పొరేషన్ లోగో ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగరపాలక సంస్థ ఔన్నత్యాన్ని ప్రతిబింబించే విధంగా లోగో రూపొందించాలని నగరపాలక సంస్థ పిలుపు మేరకు పలువురు స్పందించి నాలుగు లోగోలు పంపారు. వాటిని వివిధ ప్రసారమాధ్యమాల ద్వారా ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు చేపట్టిన ప్రక్రియలో 1వ నెంబర్ లోగోకు 40 మంది, 2వ నెంబర్ లోగోకు 2,312 మంది, 3వ నెంబర్ లోగోకు 282 మంది, 4వ నెంబర్ లోగోకు 20 మంది అనుకూలంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇందులో రెండో నెంబరు లోగోకు ఎక్కువ మంది మద్దతు తెలిపినందున కౌన్సిల్ అనుమతితో తుది లోగోను ప్రకటిస్తామని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు.

దర్జాగా చెరువుల కబ్జా

- రోజురోజుకూ మాయమవుతున్న ట్యాంకులు
- సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం బేఖాతరు
- హైడ్రా తరహా విధానం వస్తేనే మేలంటున్న పరిరక్షణ సమితి

'ఏ చెరువులోనూ సెంటు భూమిని కూడా ముట్టుకునే అధికారం జిల్లా సర్వోన్నత అధికారాలున్న కలెక్టర్‌కు కూడా లేవు. ప్రజా ప్రతినిధులకు సైతం వాటిని ప్రోత్సహించే హక్కు లేదు. ప్రజా ప్రయోజనాలు అవసరం కోసం చెరువును ముట్టుకున్నా, దానికి చట్టపరమైన విధి విధానాలు లోబడే జరగాలి'

- చెరువుల పరిరక్షణపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలివి

ప్రజాశక్తి - జామి

చెరువులు అంటేనే రైతాంగానికి, నీటి నిల్వలకు కల్పతరువులు. కానీ అవే చెరువులు మరికొద్ది రోజుల్లో పుస్తకాల్లో మాత్రమే చదువుకునే స్థితికి చేరుకునేలా కబ్జాలకు గురవు తున్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 3వేలకు పైగా చెరువులు కబ్జాలకు గురైనట్లు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి సర్వేలో తేలింది. ఈ లెక్కన కనిపించకుండా పోవడానికి మారెంతకాలం పట్టేటట్టు లేదు. ఈ నేపథ్యంలోనే పొరుగు రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న హైడ్రా వంటి ఏజెన్సీ రాష్ట్రానికి రావాలని చెరువుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి. ఒకవేళ హైడ్రా తరహా నిర్ణయం మన ప్రభుత్వం తీసుకొస్తే, ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన హైడ్రా చట్టం సంచలనం రేపుతున్న విషయం తెలిసిందే. ప్రధానంగా అక్రమణకు గురైన చెరువులు, వాగులపైన కట్టిన కట్టడాలను కూల్చేసిన తీరు అందరిలోనూ చర్చకు తెరతీసింది. అలాంటి విధానం మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకొస్తే, జిల్లాలో మాయమైన, కబ్జాలకు గురైన చెరువులు బతికి బట్టకడతాయని ప్రకృతి ప్రేమికుల ఆశ.

ఉమ్మడి విజయనగరం జిల్లా పూర్వం రాజుల పాలనలో ఎక్కువ కాలం ఉన్న కారణంగా ఎక్కడా లేనటువంటి అత్యధిక చెరువులు జిల్లాలో రాజులు తవ్వించారని నానుడి. అందులో నిజానిజాలు పక్కన పెడితే, ఉమ్మడి జిల్లాలో సుమారుగా 9,334 చెరువులు ఉన్నట్లు అధికారిక అంచనా. ఇందులో పార్వతీపురం మన్యం జిల్లాలో 2300 చెరువులు ఉండగా, మిగిలినవి విజయనగరం జిల్లాలో ఉన్నాయి. కానీ ఇందులో సుమారుగా 3 వేల చెరువులు కబ్జా కొరల్లో చిక్కుకోగా, మరో 2 వేల చెరువులు కొంత అక్రమణకు గురైనట్లు అంచనా వేస్తున్నారు. వీటిలో అత్యధికంగా రాజకీయ నాయకులు, రియల్‌స్టేట్ వ్యాపారులు చేసిన కబ్జాలే ఎక్కువ. సామాన్యుడు చెరువు గట్టుపై చిన్న పాక వేస్తే, ఆగమేఘాలపై పీకి పారేసిన అధికారులు బడా నాయకులు చెరువును మొత్తాన్ని కప్పేసినా పట్టించుకోని పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. విజయనగరం అర్బన్ ఏరియాలో 88 చెరువుల్లో 30 చెరువులకు పైగా కబ్జాకు గురికాగా, ఇందులో రియల్‌స్టేట్ వ్యాపారులు ఆక్రమించినవే అధికం. కానీ పేదలు ప్రభుత్వ భూమిలో చిన్న గుడిసె వేస్తే, నానా యాగి చేసే రెవెన్యూ అధికారులు బడా అక్రమదారుల జోలికి మాత్రం వెల్లడం లేదు. జామి మేజరు పంచాయతీలో ఊరు నడిబొడ్డున 7.36 ఎకరాల చెరువును దర్జాగా కప్పేసినా పట్టించుకోలేదు. ఇరిగేషన్ అధికారులు తమ చెరువు అక్రమణకు గురైంది, తొలగించండి అంటూ రెవెన్యూ అధికారులకు రాస్తున్నా, దాన్ని పట్టించుకోవడం లేకపోవడమే అందుకు నిదర్శనం. ఇలా ఒక్క జామి, విజయనగరమే కాదు. జిల్లాలో చాలా చెరువుల పరిస్థితి ఇదే. జిల్లాలో చెరువులను కాపాడుకోవాలంటే హైడ్రా తరహా విధానం తీసుకొచ్చి, అది సామాన్యులపై కాకుండా బడా కబ్జాదారులపై ప్రయోగించాలి. అప్పుడే చెరువుల సంరక్షణ సాధ్యమవుతుంది.

చెరువుతో మనిషి మనుగడ

చెరువులు జిల్లాలో నీటి నిల్వలకు పునాది. అత్యధిక చెరువులున్న ప్రాంతం మనది. కానీ నేడు వేలాది చెరువులు కబ్జాల పాలవుతున్నాయి. దీనిపై చెరువుల పరిరక్షణకు ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నాము. ప్రధానంగా చెరువులు, వాగులు కాపాడే విధంగా ప్రభుత్వం విధానాలు రూపొందించి దాన్ని పారదర్శకంగా పని చేసేలా చూస్తేనే లాభం.

- ఈశ్వర్ ప్రసాద్,
ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షులు

చెరువులే పొలాలకు జీవం

చెరువులు ఉంటేనే, పంట పొలాలు, భూగర్భ జలాలకు ఆధారం. రాష్ట్రంలో హైడ్రా వంటి విధానం వచ్చినా, రాకపోయినా జిల్లాలో అటువంటి విధానం అవసరం. పూర్వం రాజుల కాలంలో మన జిల్లాలో ఎక్కువ చెరువులు తవ్వించారు. కాబట్టే సాగునీటి రంగంపై ప్రభుత్వాలు ఎంత చిన్న చూపు చూసినా, చెరువుల ద్వారానే జిల్లాలో అత్యధిక పంటలు పండించేవారు. కాబట్టీ అటువంటి చెరువులును కాపాడుకోవడం మన బాధ్యత.

- బూసర్ల రమణారావు,
న్యాయవాది, జామి

చెరువులతో భూగర్భ జలాలకు రక్షణ

చెరువులు ఉంటేనే, మనిషి మనుగడకు అవసరమైన భూగర్భ జలాలు మిగిలి ఉంటాయి. కాబట్టీ చెరువులను ప్రతి ఒక్కరూ కాపాడు కోవాలి. హైడ్రా వంటి విధానం వస్తే, చెరువు ఆక్రమణ చేపట్టిన బడా అక్రమార్కులపైన, అందుకు సహకరించిన అధికారులపైన చర్యలు తెసుకోవాలి.

- రాయవరపు సత్యం,
ఆయకట్టు రైతు సంఘం నాయకులు,
వెన్నెపాడు

విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రోడ్డుపై నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

ఇజ్రాయిల్ దాడులను ఆపాలి

పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాల నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో సోమవరం జిల్లాలో పలుచోట్ల నిరసనలు తెలిపారు. విజయనగరం స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఇజ్రాయిల్ గత ఏడాది నుంచి పాలస్తీనాపై జరిపిన దాడులు కారణంగా 85 వేల మంది వరకు పాలస్తీనా పౌరులు మరణించారని తెలిపారు. పాలస్తీనా భూ భాగాలపైన, పాఠశాలలు, మసీదులుపైనా వైమానిక దాడులు చేసి వేలాది మందిని పొట్టన పెట్టుకుంటున్నారని తెలిపారు. ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాలు సరఫరా చేసి ఈ యుద్ధాలకు కారణమవుతోందని అన్నారు. ఈ యుద్ధం కారణంగా మన దేశంలో ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నార న్నారు. ముఖ్యంగా భారత్ కు పశ్చిమాసియా దేశాల నుండి ఆయిల్ దిగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయని, యుద్ధం కారణంగా క్రూడా యిల్ ధరలు పెరుగుతున్నాయని తెలిపారవు. వెంటనే ఐక్య రాజ్య సమితి కలుగజేసుకొని ఇజ్రాయిల్ దాడులను ఆరికట్టి శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సురేష్, పి.రమణమ్మ, ఆర్.ఆనంద్, చిన్నారి, సిపిఐ నాయకులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా సోమవారం బలిజిపేట రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. ఏడాది కాలంగా పాలస్తీనా, లెబనాన్‌లో ఆసుపత్రులు, పాఠశాలలు, మసీదులపై ఇజ్రాయిల్ దాడులకు తెగబడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాలు సరఫరా చేస్తూ ఆ మారణహోమానికి కారణమవుతోందని చెప్పారు. ఈ ప్రాంతంలో ఈ యుద్ధం పెరిగితే మన పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందన్నారు. తక్షణమే ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, శాంతిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు బి.యుగంధర్, జి.రామారావు పాల్గొన్నారు.

బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్మికులు

కలెక్టరేట్ పోర్టుకో వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

కమిషనర్‌పై సచివాలయ ఉద్యోగుల తిరుగుబాటు

ప్రజాశక్తివిజయనగరం టౌన్

విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య తీరుపై నగరంలో సచివాలయ ఉద్యోగులు తిరుగుబాటు చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌కు భారీగా చేరుకుని, పోర్టుకో వద్ద బైఠాయించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు, అనంతరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు సచివాలయ ఉద్యోగులను కమిషనర్ వేధించడమే పనిగా పెట్టుకున్నారని వారు వాపోయారు. శనివారం నిర్వహించిన సమావేశంలో 18వ సచివాలయ అడ్మిన్ స్పృహ తప్పి పడిపోతే ఆమెను ఆసుపత్రిలో చేర్పించకుండా సాయంత్రం వరకు కార్యాలయంలో ఉంచి, సమావేశం నిర్వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి మెసేజ్‌లు పెట్టడం, రాత్రి సమయంలో ఫోన్ చేసి ఉదయానికి ఆ పని చేయకుంటే మెమో ఇస్తున్నారని వాపోయారు. అడ్మిన్లతో నిర్వహించిన సమావేశంలో 'థర్డ్ జెండర్లు చప్పట్లు కొట్టి రోజుకు రూ.3 వేలు వసూలు చేస్తున్నారు, మీరు రోజుకు రూ.3 వేలు పన్నులు వసూలు చెయ్యలేకపోతున్నారు' అంటూ కమిషనర్ వ్యాఖ్యానించినట్లు ఉద్యోగులు వాపోయారు. వేధింపులు నుంచి కాపాడాలని కోరారు.

వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ● ఉత్సవ వేదికలు, సిరిమాను తయారీని పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం వైభవాన్ని, సంస్కృతిని చాటి చెప్పే విధంగా ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎం ఎస్ ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌చెప్పారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, జాయింట్ కలెక్టర్ ఎస్. సేతు మాధవన్‌తో కలిసి సోమవారం ఉత్సవ వేదికలను పరిశీలించారు. మంత్రి ముందుగా శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. క్యూలైన్లను పరిశీలించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం హుకుంపేటలో సినిమాను తయారీని మంత్రి పరిశీలించారు. అనంతరం మెగా ఈవెంట్ జరిగే అయోధ్య మైదానానికి మంత్రి చేరుకున్నారు. 13,14 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించే మెగా ఈవెంట్ పై, సంబంధిత వేదికల ఇన్చార్జిలతో చర్చించారు.

వైభవాన్ని చాటిచెబుతాం

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ మన జిల్లా వైభవాన్ని చాటిచెప్పేవిధంగా విజయనగరం ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సిరిమానోత్సవానికి సంబంధించి భక్తులకు ఎటువం టి ఇబ్బందులు రాకుండా పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పోలీసులు సోదరభావంతో మెలిగి, భక్తులకు సహకారం అందించాలని కోరారు. 13న భారీఎత్తున ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న యువత, ప్రేక్షకులు మెచ్చేవిధంగా మెగా ఈవెంట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిరిమాను ఉత్సవానికి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆహ్వానించామని మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ భక్తులందరూ అమ్మవారిని దర్శించుకునేలా ఈ ఏడాది ఉచిత దర్శన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పర్యటనలో డిఆర్ఓ ఎస్‌డి అనిత, ఉత్సవాల స్పెషల్ ఆఫీసర్ త్రినాధరావు, ఆర్‌డిఓ డి.కీర్తి, ఇఇ డివివి ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డిఆర్‌డిఎ పీడీ కల్యాణచక్రవర్తి, ఆర్ అండ్‌బి ఎస్ఈ కాంతిమతి, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు, సిపిఓ పి.బాలాజీ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, మెప్మా పీడీ శ్రీనివాసరావు, డిఎస్ఓ వెంకటేశ్వర్రావు, ఐవిపి రాజు పాల్గొన్నారు.

ఉత్సవ ఏర్పాట్లపై ఆరాతీస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

250 స్టాళ్లతో డ్వాక్రా బజారు

డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి

విజయనగరంకోట : విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ పండగ నేపథ్యంలో ట్యాంకు బండ్ రోడ్డులో 250 స్టాళ్లతో అఖిల భారత డ్వాక్రా బజారు(సరాస్) ను ఏర్పాటు చేయనున్నట్లు డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై తన కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు ట్యాంకు బండ్ రోడ్డులోని మాన్సాస్‌స్థలంలో డ్వాక్రా బజారు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో మహిళా సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులతో 250 స్టాల్స్‌తో పాటు, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీములు ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. డ్వాక్రా బజారు ఏర్పాటుకు కావాల్సిన వాటర్ ప్రూఫ్ షెడ్, స్టాళ్ల నిర్మాణం దాదాపు పూర్తయినట్లు పీడీ తెలిపారు.

గ్రీవెన్స్‌కు 161 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చిన వినతులకు ఖచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని, రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. వినతులు వచ్చిన రోజే అధికారులు ఓపెన్ చేయాలని, ఎక్కువగా రెవిన్యూ కు చెందిన వినతులే వస్తున్నాయని, తహసిల్దార్లు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సోమవారం ప్రజా వినతులు పరిష్కార వేదికలో భాగంగా సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డి అనిత ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 161 వినతులు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 102 వినతులు అందాయి. పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్‌డిఎకు 25 వినతులు అందాయి.

ట్రాన్సిట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

విజయనగరంలో కార్పొరేషన్ సేకరించిన చెత్తను తరలించేందుకు గత టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన విధంగా నగరం నలుమూలలా ట్రాన్సిట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పార్టీ నాయకులు వినతిని అందజేశారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

సత్వర న్యాయం కోసం

శాశ్వత లోక్ అదాలత్

పూర్తి ఉచితంగా న్యాయం పొందే అవకాశం : లోక్ అదాలత్ జిల్లా చైర్మన్ దుర్గయ్య

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

సత్వర న్యాయం అందించేందుకు జిల్లాలో శాశ్వత లోక్ అదాలత్ ను ఏర్పాటు చేసినట్లు అదాలత్ జిల్లా చైర్మన్, న్యాయమూర్తి జి.దుర్గయ్య తెలిపారు. సేవలు పొందే వారు, సేవలు అందించేవారు కూడా ఈ న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం పొందవచ్చునని చెప్పారు. ప్రజా ప్రాయోజిత సేవల శాశ్వత ప్రజా న్యాయ పీఠం (పర్మినెంట్ లోక్ అదాలత్) లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉమ్మడి జిల్లాకు సంభందించి శాశ్వత లోక్ అదాలత్ విజయనగరంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లీగల్ సర్వీసెస్ యాక్ట్ ప్రకారం ఏర్పాటైన ఈ న్యాయస్థానాన్ని ఆశ్రయించేవారు కొద్ది నెలల్లోనే న్యాయం పొందే అవకాశం ఉందని అన్నారు. ఎటువంటి కోర్టు ఫీజులూ చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి ఉచితంగా న్యాయం పొందవచ్చునని సూచించారు. అవకాశం ఉన్నవారు న్యాయవాదిని నియమించు కోవచ్చునని, న్యాయవాది లేకుండా కూడా నేరుగా తమ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునని సూచించారు. ఇక్కడ తీర్పు వెలువడిన తర్వాత, ఓడిపోయినవారు వేరే న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేదని, కేవలం హైకోర్టులో మాత్రమే రిట్ వేయాల్సి ఉంటుందని తెలిపారు. సివిల్ కోర్టుతో సమానంగానే తీర్పులు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కోటి రూపాయలు వరకు విలువైన పరిహారం పొందే అవకాశం ఉన్న కేసులను ఇక్కడ వేసి, పరిహారం పొందవచ్చునని సూచించారు.

మాట్లాడుతున్న లోక్‌అదాలత్ జిల్లా చైర్మన్ దుర్గయ్య

రియల్ ఎస్టేట్, హౌసింగ్ కార్పొరేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, సెల్ ఫోన్ సేవలు, పోస్టల్ డిపార్ట్మెంట్, మున్సిపాలిటీ, పంచాయతీ, విద్యుత్ శాఖ, రోడ్డు, సముద్ర, వాయు రవాణా, శానిటేషన్, కన్జర్వేషన్, ఉపాధి హామీ పథకం తదితర 10 రకాల ప్రభుత్వ, ప్రైవేటు సేవలకు సంబంధించి లోక్ అదాలత్ ను ఆశ్రయించవచ్చని సూచించారు. కేసు నమోదు చేసిన తరువాత, సంబంధిత ప్రతివాదులు రాకపోయినా కేసు నడుస్తుందని, ఆధారాలు బట్టి డిగ్రీ జారీ చేస్తారని తెలిపారు. సేవలకు సంబంధించి నష్టపోయిన వారు ఎవరైనా తమ న్యాయస్థానాన్ని ఆశ్రయించి, ఎటువంటి కోర్టు ఫీజు చెల్లించకుండానే పూర్తి ఉచితంగా సత్వర న్యాయాన్ని పొందే అవకాశం ఉందని, దీనిని ఉపయోగించుకోవాలని చైర్మన్ దుర్గయ్య కోరారు. సమావేశంలో సభ్యులు పి.సాంబశివరావు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడును తొలగించాం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి- రాజాం

రాజాం ప్రాంతంలో గత 15 సంవత్సరాలుగా సిపిఎంలోనూ, అనుబంధ సంఘం సిఐటియులోనూ పనిచేస్తున్న సిహెచ్ రామ్మూర్తినాయుడును పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన రాజాంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సిపిఎం, సిఐటియు పద్ధతులకు భిన్నంగా రామ్మూర్తి నాయుడు వ్యవహరించడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ రోజు నుంచి పార్టీతో కానీ, సిఐటియుతో కానీ ఏ స్థాయిలోనూ రామ్మూర్తినాయుడుకు ఎటువంటి సంబంధమూ లేదని తమ్మినేని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, నాయకులు టివి రమణ పాల్గొన్నారు.

పిడుగుపాటుతో మహిళా రైతు మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని కె.ఎస్.ఆర్ పురంలో సోమవారం పిడుగుపడి మహిళా రైతు మృతిచెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ కె.లక్ష్మణరావు కథనం ప్రకారం... కెఎస్ఆర్‌పురం గ్రామానికి చెందిన మహిళా రైతు బూడి అప్పలమ్మ (65) తమ పత్తి పొలంలో పనికోసం సోమవారం మధ్యాహ్నం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కూలీలను తీసుకెళ్లారు. కూలీలతో పాటు ఆమె కూడా పత్తి ఏరుతుండగా అకస్మాత్తుగా మేఘాలు రావడంతో సమీపంలోని చింతచెట్టు కిందకు అందరూ చేరారు. ఉన్నట్టుండి పిడుగు పడటంతో ఘటనా స్థలంలోనే అప్పలమ్మ మృతిచెందారు. లింగాలవలస, గడసాం, కెఎస్ఆర్‌పురం గ్రామాలకు చెందిన ఆరుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అప్పలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

సమాన అవకాశాలున్న విద్యా విధానం కావాలి

- విద్యార్థులను బడికి దూరం చేస్తున్న ప్రభుత్వ సంస్కరణలు
- ఎపిటిఎఫ్ రాష్ట్ర మహాసభలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అందరికీ సమాన అవకాశాలు గల విద్యా విధానం రావాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర మహాసభలో వక్తలు డిమాండ్ చేశారు. ఎపిటిఎఫ్ 20వ రాష్ట్ర విద్యావిజ్ఞానిక మహాసభలో భాగంగా రెండవరోజు పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. గిరిజన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ టివి కట్టిమణి మాట్లాడుదూ తాను ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి ఉపాధ్యాయులే కారణమన్నారు. సామాజిక మార్పుకు సమాజశ్రేయస్సుకు కృషి చేసే ఉపాధాయడే నాయకుడన్నారు. అయితే ఇటీవల ప్రభుత్వాలు చేస్తున్న సంస్కరణలు, సంక్షేమ పథకాలు విద్యార్థులు బడి మానివేసేలా ప్రేరేపిస్తున్నాయని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో డ్రాపౌట్స్ ఎక్కువని , బడి వయసు పిల్లలను బడిలోకి తీసుకు రావడం ద్వారా పేదలకు ప్రభుత్వ విద్య అందుతుందన్నారు. ఎపిటిఎఫ్ జాతీయ అధ్యక్షులు జె.జతిన్ మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయుడి పాత్ర కీలకమని అన్నారు. నాయకులు మార్పు బాలకృష్ణమ్మ, చెన్నుపాటి తదితరులు సామాజిక ఉద్యమాలలో మమేకమై మంచి సమాజం కోసం కృషి చేశారని గుర్తు చేశారు. ప్రముఖ ఆర్థిక రంగ నిపుణుడు డి. అప్పారావు 'ఆర్థిక సంక్షోభం- విద్యారంగంపై ప్రభావం' అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఇఫ్టు కార్యదర్శి సిహెచ్ఎస్ఎన్ మూర్తి విద్యాప్రైటీకరణ అనే అశంపై మాట్లాడారు. గ్రామీణ పేదల సంఘం నాయకులు రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ శ్రీకాకుళం గిరిజనోద్యమం..ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై మాట్లాడారు. అనంతరం మహిళా సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, చిరంజీవి, మరెళ్ళపూడి సత్య శర్మ, రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిటియు విసి కట్టిమణి

ప్రజాదర్బార్‌కు పోటెత్తిన వినతులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ సతీష్ అధ్యక్షతన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి వినతులు పోటెత్తాయి. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందించేందుకు భారీగా తరలివచ్చారు. మొత్తం 1078 వినతులు రావడం విశేషం. అందులో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 558 అర్జీలు అందాయి. అత్యల్పంగా విద్యుత్తు శాఖకు సంబంధించి రెండు వినతులు వచ్చాయి. వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ సంతోష్ కుమారి, తహశీల్దార్ అరుణకుమారి, ఇఒపిఆర్‌డి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన వినతి

ట్రాక్టర్స్, హైడ్రాలిక్ జెసిబి వర్కర్స్ యూనియన్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, శ్రీ విజయ దుర్గ ట్రాక్టర్స్, హైడ్రాలిక్ జెసిబి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, వాకాడ భరత్, గేదెల శ్రీను, మజ్జి గంగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, సిఐటియు నాయకులు వజ్రపు అప్పారావు, కనిశెట్టి సన్నిబాబు, మంచిని రాము, దొరబాబు పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

పశుసంచార ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పశు సంచార ఉద్యోగులకు జీవో 7 అమలు చేసి రూ.18500 వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు .సోమవారం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పశు సంచార వైద్య సేవ వాహనంలో పని చేస్తున్న డ్రైవర్, హెల్పర్‌లకు జిఒ 07 వర్తింప చేసి వేతనాలు పెంచాలని కోరారు. 2022 మే నెలలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పశు సంచార వాహనాలను ప్రారంభించిందన్నారు.టోల్ ఫ్రీ నెంబర్.1962 ఈ పథకాన్ని జివికెఇ ఎంఆర్ ఐ సంస్థకు అవుట్ సోర్సింగ్ చేసిందన్నారు. ఈ పథకంలో పనిచేస్తున్న డ్రైవర్ కమ్ హెల్పర్‌లకు మాత్రం జిఒ 7ప్రకారం వేతనాలు చెల్లించడం లేదన్నారు. జివికెఇఎంఆర్ఐ కేవలం రూ.11600 మాత్రమే చెల్లిస్తుందన్నారు. జీవో వర్తింపజేసి ప్రతినెలా వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. పిఎఫ్ యాజమాన్య వాటా యాజమాన్యమే చెల్లించేలా చర్యలు చేపట్టాలని, పిఎఫ్ లోన్‌లు వచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్. నరేష్, సాయి, భద్రకాళి, రాంబాబు, ఎం.సురేష్, సిహెచ్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పశు సంచార ఉద్యోగులు

ముగిసిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 5,6 తేదీల్లో స్థానిక రెవెన్యూ హోంలో 4వ రాష్ట్రస్థాయి ఫైర్ చెస్ స్కూల్ పోటీలను శ్రీ చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం, ఫైర్ చెస్ స్కూల్ ఆధ్వర్యాన నిర్వహించారు. పోటీలకు రాష్ట్రమొత్తంగా 250 మంది 26 జిల్లాల నుంచి హాజరయ్యారు. వారిలో యం.జ్ఞాన సాయి సంతోష్ (కాకినాడ) ప్రథమ స్థానం, యం. వెంకట రిత్విక్ (విశాఖ), యస్. వరహాలు (విశాఖ) ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ. సురేష్, ఆంధ్రాచెస్ అసోసియేషన్ సిఇఒ కెవి జ్వాలాముఖి, కార్యదర్శి కె. జగదీష్, కోశాధికారి కెకె జగన్నాధం, ఆంధ్రాచెస్ అసోసియేషన్ సభ్యులు భీశెట్టి బాబ్జీ, యంవిఆర్ కృష్ణాజి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

విజయనగరం కోట : జిల్లాలో గల పిహెచ్‌సి, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులకు క్షయ , కుష్టువ్యాధులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ 2027 నాటికి, క్షయ, కుష్టు వ్యాధుల నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. అశావర్కర్లకు, ఎఎన్ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పికు వైద్యాధికారుల ద్వారా శిక్షణ ఇవ్వాలని సూచించారు. శిక్షణలో క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, డాక్టర్ ఎ. అర్చన దేవి, డిఎన్ఎంఒ డాక్టర్ ఎం. శ్రావణి, డాక్టర్ ఎం.సతీష్ పాల్గొన్నారు.

జెఎల్‌ఎంకు సత్కారం

నెల్లిమర్ల : జెఎల్ఎంగా బదిలీ అయిన ఉద్యోగికి పంబ గోపి దాస్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. సతివాడ, ఒమ్మిలో గత 5 సంవత్సరాలుగా జూనియర్ లైన్ మెన్‌గా పని చేస్తున్న గోపిదాస్‌కు గుంటూరు డివిజన్‌కి బదిలీ అయ్యింది. ఈ నేపథ్యంలో తోటి ఉద్యోగులు ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సతివాడ, ఒమ్మి నాయకులు పాల్గొన్నారు.

భూ వివాదంపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

భోగాపురం : కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ తన భూమిని వేరే వ్యక్తి పేరు మీద ఆన్‌లైన్ చేసేసారని పోలిపల్లి గ్రామానికి చెందిన కర్రోతు కొత్తమ్మ అనే మహిళా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఆన్లైన్ చేసిన భూమిని రెడ్ మార్కులో పెట్టాలని కోరారు. ఈ భూమిలోని తాటి చెట్లను అక్రమంగా నరికేసారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విజయవాడకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట : భవాని భక్తుల కోసం శృంగవరపుకోట నుంచి విజయవాడకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. ప్యాకేజీ బస్సులు కావాల్సిన వారు సూపరింటెండెంట్ వెంకట రావు - 7382923679, డిప్యూటీ సూపరింటెండెంట్ సన్నిబాబు - 9490583579 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

బొండపల్లి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో గజపతినగరం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సహాయకులకు సోమవారం యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. గాజులరేగ వ్యవసాయ పరిశోధన స్థానం ముఖ్య శాస్త్రవేత్త తేజేశ్వరరావు, జిల్లా వనరుల కేంద్రం ఎడి భారతి మాట్లాడుతూ ప్రధాన పంటల యాజమాన్య పద్ధతులు, చీడ పీడ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. గజపతినగరం ఎడి కె.మహారాజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఎఒలు గోవిందమ్మ, ధనలక్ష్మి, లోకేష్, గోకుల్‌కృష్ణ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పిఆర్‌సి కమిటీని నియమించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారుల వేతనాలకు సంబంధించి 12వ పిఆర్‌సి అమలుకు కమిటీని తక్షణమే నియమించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు జెసి రాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 12వ పిఆర్‌సిని 2023 జులై నుండి అమలు చేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేసి ఏడాదిలో నివేదిక ఇవ్వాలని ఆదేశించినా, అందుకు అవసరమైన వసతులు, సిబ్బందిని సమకూర్చలేదని తెలిపారు. దీంతో ఎటువంటి కార్యకలాపాలూ నిర్వహించకుండా ఆ కమిటీ రాజీనామా చేసిందన్నారు. బకాయి డిఎలను చెల్లించాలన్నారు. పిఎఫ్ రుణాలు, పార్ట్ ఫైనల్స్‌కు దరఖాస్తు చేసి 6 నెలలు గడుస్తున్నా నేటికీ మంజూరు చేయలేదని చెప్పారు.

మట్టి నమూనాలపై విద్యార్థులకు అవగాహన

శృంగవరపుకోట : మండలంలోని కిల్తంపాలెం వద్దనున్న జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు సోమవారం మట్టి నమూనాలపై ఎడి విజయ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మట్టి నమూనాలు ఎలా తీయాలి, ఎందుకు తీయాలి, దీని ఉపయోగాలపై విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో భూసార పరీక్షా విభాగం అధికారులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరణ

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మండల స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి జి.ఉమ.. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 15 రోజుల్లోగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపిడిఒ తెలిపారు.

జూనియర్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు 20 పతకాలు

విజయనగరం టౌన్ : ఈనెల 4, 5, 6 తేదీల్లో రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా అథ్లెట్స్ 20 పతకాలు సాధించారు. ఇందులో 11 గోల్డ్ ,6 సిల్వర్, 3 బ్రాంజ్ పతకాలు ఉన్నాయి. కోచ్‌లుగా పి.సతీష్ , వై.మధు, పి.శేఖర్, ఎ.లక్ష్మణ్ వ్యవరించారు. వీరిని అథ్లెటిక్ అసోసియేషన్ సిఇఒ ఎ.హైమా, సెక్రటరీ గౌతమ్ కుమార్, సెలక్షన్ కమిటీ చైర్మన్ నారాయణరావు , జిల్లా అథ్లెటిక్ సంఘ సభ్యులు అభినందించారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు తమ సమస్యలపై కమిషనర్ పి.నల్లనయ్యకు వినతులు అందజేశారు. ఈ వారం ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 3 వినతులు, రెవెన్యూ విభాగానికి సంబంధించి 1 వినతి వచ్చాయి. ప్రజల నుండి వచ్చిన వినతులు పరిష్కరించే దిశగా కృషి చేయాలని సంబంధిత విభాగాధిపతులకు కమిషనర్ ఆదేశించారు. 55 వ నెంబర్ సచివాలయ పరిధిలో వీధి దీపాలు వేయాలని, 7వ నంబరు సచివాలయ పరిధి జమ్ములో కాలువలు ఏర్పాటు చేయాలని, 37 నెంబర్ సచివాలయాల పరిధి లో అంబేద్కర్ భవనం నిర్మాణానికి పనులు పూర్తి చేయాలని కోరుతూ వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పార్కులో పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యనపేట మున్సిపల్ పార్కుల్లో పిచ్చి మొక్కలు, చెట్లు కొమ్మలు పెరిగి అపరిశుభ్రంగా ఉండటంతో పార్కు కు వచ్చే వాకర్సు సోమవారం శ్రమదానం చేపట్టి వాటిని తొలగించారు. పిచ్చి మొక్కలు పెరిగిపోవడం, పక్కనే చెరువు ఉండటం వలన పాములు,పురుగులు వస్తున్నాయి. నగర పాలక సంస్థ అధికారులు,సిబ్బంది పట్టించుకోకపోవడంతో వాకర్సే వాటిని స్వచ్ఛందంగా తొలగించారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ సొంతంగా మనుషులను పెట్టి చెత్తను తొలగించారు.

పార్కులో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న వాకర్స్

సెలవు రోజుల్లో తరగతులు

అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించి 6 రోజులు గడుస్తున్నా జిల్లాలో మాత్రం ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా కళాశాలలు, పాఠశాలలో తరగతులు నడుస్తున్నాయి. వీటిపై వచ్చిన సమాచారంతో ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ఆయా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలను సందర్శించి తరగతులు నిర్వహిస్తున్న కళాశాలల వద్ద ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులకు సెలవులు ప్రకటించేలా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సి హెచ్ వెంకటేశ్ మాట్లాడుతూ విజయనగరంలో పలు విద్యాసంస్థలు ఇప్పటికీ దసరా సెలవులు ప్రకటించలేదని తెలిపారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. తక్షణమేఅధికారులు సెలవులు అమలయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు కె.రాజు, ఉపాధ్యక్షులు గుణ , రాహుల్, సాయి ,యశ్వంత్ టౌన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం కోట

తమను కొనసాగించాలని కోరుతూ వార్డు, గ్రామ సచివాలయాల వాలంటీర్లు సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వార్డు సచివాలయ వాలంటీర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ రవీంద్ర, కో- కన్వీనర్లు మోహన్, ఆదిత్య, కుమారి, దేవి ఆధ్వర్యాన ధర్నా జరిగింది. వీరికి ఎఐటియుసి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2 లక్షల అరవై వేల మంది వాలంటీర్లు చంద్రబాబునాయుడు న్యాయం చేస్తారని ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆవేదన అర్థం చేసుకొని ఉద్యోగాల్లో కొనసాగించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నల్లనయ్యకి వినతి అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎస్ రంగరాజు, జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు, క్లాప్ వెహికల్ డ్రైవర్లు యూనయన్ జిల్లా అధ్యక్షుడు పొడుగు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి సుపరిపాలనకు అంబేద్కరే మార్గదర్శి

విగ్రహాల ఆవిష్కరణలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రామభద్రపురం

గత వైసిపి పాలకుల సుపరిపాలనకు రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కరే మార్గదర్శి అని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని ఆరికతోటలో జాతీయ రహదారి పక్కన స్థానిక దళితులు ఏర్పాటు చేసిన అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి మహనీయులను అనునిత్యం స్మరించుకోవాలన్నారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసిన సర్పంచ్ పెంకి పుష్పమ్మ, మాజీ సర్పంచ్ భీమయ్య, ఎంఆర్‌పిఎస్ నేత సుధాకర్ మాదిగకు ఈ ప్రాంత దళితులు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, ఉప ఎంపిపి పెంకి అరుణ, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, విశ్రాంత ఎంఇఒ పెంకి జార్జ్ ఎబినైజర్, రేజేటి అప్పారావు, యువనేత పెంకి శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలో జరుగుతున్న కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విశాఖపట్నంలోని గ్రీన్ వాలీ పునరావాస కేంద్ర వ్యవస్థాపకులు ఉమారాజ్ ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్‌సిసి క్యాడెట్‌లను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ తాపస్ మండల్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ పల్లవి వర్మ, సత్యా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామ్మూర్తి, సుబేదార్ మేజర్ అనిల్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

బొబ్బిలి రూరల్ : ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పని ప్రదేశాలలో లైంగిక వేధింపులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పని ప్రదేశాల్లో తమ హక్కులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రవి కుమార్ పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగునీరు రాకుండా చర్యలు

బొబ్బిలి : పూల్‌బాగ్ రోడ్డుపైకి మురుగునీరు రావడంతో ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు రోడ్డుపైకి రాకుండా నివారించేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి, మున్సిపల్ అధికారులు కలిసి జెసిబితో కాలువ తవ్వారు. దీంతో ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శిక్షణ వాయిదా

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు సోమవారం నుంచి నిర్వహించాల్సిన శిక్షణ వాయిదా పడిందని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఈ నెల 9, 10, 11, 12వ తేదీల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

గ్రామదేవతల పండగలతో

సంప్రదాయాల పరిరక్షణ

ప్రజాశక్తి-బొండపల్లి

మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు గ్రామదేవతల పండగలు దోహద పడతాయని చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండలంలోని ముద్దూరు గ్రామంలో బంగారమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మంత్రి దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆచార సంప్రదాయాలను కొనసాగించడంలో పల్లె ప్రజలు ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కోరాడ కృష్ణ, మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము, సర్పంచులు మునకాల పైడిపునాయుడు, నంబూరి రాజేష్, ముదునూరి శ్రీనివాసరాజు, మీసాల జానకిరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రతిఒక్కరూ గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని జిల్లా పరిషత్తు డిప్యూటీ సిఇఒ రాజకుమార్ కోరారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ఉపసర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య పనులు, వీధి దీపాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు.పంచాయతీరాజ్ చట్టం చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఆర్‌డిసి కోఆర్డినేటర్ దేవుడు, ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి, ఇఒపిఆర్‌డి భానోజీరావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఎంపిడిఒ కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు ఇఒపిఆర్‌డి లక్ష్మి అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి అధికారాలు, విధులు, బాధ్యతలు, గ్రామాల్లో పారిశుధ్యం, పంచాయతీలకు సొంత ఆదాయ వనరులు, వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై ఇఒపిఆర్‌డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ చైర్మన్‌ను కలిసిన సరగడ

ప్రజాశక్తి భోగాపురం

రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కర్రోతు బంగార్రాజును చెరుకుపల్లి గ్రామానికి చెందిన మండల తెలుగు యువత అధ్యక్షులు సరగడ తోగులు రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని మార్క్‌ఫెడ్ కార్యాలయానికి వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : బేబినాయన

ప్రజాశక్తి-రామభద్రపురం

రామభద్రపురం కూరగాయల మార్కెట్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. సోమవారం రామభద్రపురం మార్కెట్లో టిడిపి రాష్ట్ర నాయకులు చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని, తమ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన ఎన్నో సమస్యలను ప్రస్తుత పాలకవర్గం సమన్వయ ంతో ఆదర్శవంతంగా పరిష్కరించడం అభినందనీయమన్నారు. పంచాయతీ తీర్మానం మేరకు ఇంటింటా తాగునీటి సదుపాయం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. త్వరలోనే రక్షిత మంచినీటి పథకం ద్వారా కుళాయిలు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. అనంతరం సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు ఆధ్వర్యంలో కుళాయి కనెక్షన్ ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు విజయ భాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుళాయిని ప్రారంభించిన బిందెతో నీరు పట్టిన ఎమ్మెల్యే బేబినాయన

బాధితుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో 48 మంది బాధితులు తమ సమస్యలపై వినతులు ఇచ్చారు. ఈ ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 21, కుటుంబ కలహాలకు సంబంధించి 3, మోసాలకు పాల్పడినట్లుగా 11, ఇతర విషయాలకు సంబంధించినవి 13 ఫిర్యాదులు ఉన్నాయి. వారి సమస్యలను విన్న ఎస్‌పి వాటి పరిష్కారానికి ఆయా స్టేషన్ల పోలీసు అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, పరిష్కారానికి చట్ట పరిధిలోచర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, డిసిఆర్‌బి ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని వెలమవారివీధి, గాంధీబొమ్మ, చీపురుపల్లివీధి, శ్వేత చలపతి స్కూల్ రోడ్డు, మున్సిపల్ మార్కెట్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. వెలమవారివీధిలో ఉన్న షాపుల వ్యాపారులు రోడ్లపై, కాలువల్లో చెత్త వేయడంతో కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కార్మికులను హెచ్చరించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఆమెతో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అనుమానాస్పదంగా పెయింటర్ మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని ఓ నిర్మాణ భవనం పైనుంచి పడి పెయింటర్ మారేడిపల్లి గణేష్ (35) మృతి చెందినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేపాడ మండలం పెద్ద గుడిపాల గ్రామానికి చెందిన మారేడి పల్లి గణేష్ పెయింటింగ్ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అందులో భాగంగా ఎస్.కోట కాలేజ్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న నూతన భవనానికి వారం రోజులుగా ముగ్గురు పెయింటర్లు పెయింట్ చేస్తూ అక్కడే ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే భోజనం చేసి పడుకున్నాడు. తెల్లవారి చూసేసరికి గణేష్ లిఫ్ట్ ను ఏర్పాటు కోసం విడిచిన స్థలం పైనుంచి కిందపడి చనిపోయి ఉన్నాడు. గణేష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని భార్య సంతోషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణానికి చెందిన నారంశెట్టి మృత్యుంజయరావు(70) అనారోగ్యంతో మేదరబంద బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దేవాంగులవీధికి చెందిన మృత్యుంజయరావు చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మందులు వాడినప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి బావిలో దూకాడు. మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆయన కుమారుడు రామచంద్రమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అక్కడికి చేరుకున్ని మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ ఆర్.రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE VIZIANAGARAM
O.S. 64/2017

Between:
Smt. Mongam Jayalakshmi and others ......Plaintiffs
And:
Sri. Mongam Venkata Gandhi and others ......Defendants

To
D-18: Sri. Mongam Ravi Kiran, S/o late Ramakrishna, Aged 35 years, Hindu, Residing at House No. 170, Palepuvari Street, Near Raithu Bazar, Vizianagaram.
D-19: Kum. Mongam Swathi, D/o late Ramakrishna, Aged 33 years, Hindu, Residing at House No. 170, Palepuvari Street, Near Raithu Bazar, Vizianagaram.
D-20: Maddula Snehalatha, W/o Srinvasa Rao, Aged 31 years, Hindu, Residing at House No. 170, Palepuvari Street, Near Raithu Bazar, Vizianagaram.

NOTICE.
Take notice that the plaintiffs filed the above suit for partition of the suit schedule properties in which you are the defendants 18 to 20 and the said suit stands posted to 16-10-2024 for notice to you. If you got any objection in the above suit you can appear in person or through an advocate and file your objections if any on **16-10-2024 at 10-30 A.M** in the above Court.

L.SATYANARAYANA
Advocate for the Plaintiff
Vizianagaram

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE, AT VIZIANAGARAM
O.S.NO.498/2015

Between:
Mohammad Akbar Sharif .....nd:
M.Abdul Hameed (died) and others ...Defendants

To
R-5: Mohammad Noor Alam, s/o late M. Abdul Hameed, r/o Door no. 1-2-22, Cantonment, Vizianagaram.

NOTICE
Please take notice that the above case stands posted to 23-10-2024 before the above court for your appearance. So, you are hereby required to present before the Honourable Court on **Dt.23-10-2024 at 10.30 A.M** either personally or through your Advocate, failing which the matter will be decided in your absence basing on the available record.

T.V.SRINIVASA RAO,
Advocate,
Vizianagaram.
Ph.no.9440192479

IN THE HONORABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P.18/2024

Between
1.Govindu Venkata Lakshmi Narasinga Rao S/o. late Govindu Srinivasa Rao. Aged 59 years, Hindu, House No.77, Near Sai Baba Temple, 4th Bit, Mangalaveedhi Colony, Phool Bagh Colony, Viziangaram, presently residing at , Ananthavaram Road, Maddi Village, Padmanabham Mandal, Visakhapatnam District
2. Govindu Bhanumathi -res- do-
3. V.V.S. Harsha Kumar Govindu -res-do- ...... Petitioners
And
Gajjalapu Satyavathi @ Boringu Satyavathi and others .....Respondents

NOTICE TO RESPONDETS
1. Gajjalapu Satyavathi @ Boringu Satyavathi W/o Govinda, age 65 years, 4th Bit, Near School, Mangalaveedhi Colony, Pool Bagh Colony, VIzianagaram
2. Chodipalli Varalakshmi W/o. Gurumurthy, 4th Bit, Near School, Mangalaveedhi Colony, Poolbagh Colony, Vizianagaram
3. R. Gowri W/o R.Venkata Rao, Plot No. 203, Satya Sai Karthikeya Heights, Near S.P.Bunglow, Vizianagaram
4. Yelisetty Krishna Bhanu W/o Suresh Babu Plot No. 202, Sai Annapurna Enclave, Near Gurudatta Public School, KothaAgraharam, Vizianagaram
5. Sinagam Saraswathi, W/o Venkata Rao, H.No.81, Near Saibaba Temple, Mangalaveedhi Colony, PB Colony, Vizianagaram
6. Pulagam Narasinga Rao (Lorry Driver) Behind Sai Baba Temple, Mangalaveedhi Colony, Pool Bagh Colony, Vizianagaram
7. Chintada Parvathi W/o Late Kameswara Rao, Tiffin Center, NTR Junction, Phool Baagh Colony, Vizianagaram
8. Suvvala @Baddi Lakshmi C/o Durga Rao Kothuru, Budathanapalli, Gantyada Mandalam, Vizianagaram District
9. Adi Reddy Garu. Financer, Babametta, Vizianagaram
10. Allada Srinu, House No. 67, Opposite School, Mangalaveedhi Colony, Poor Baagh Colony, Viziangaram...Respondents

NOTICE
It is hereby informed that the above named petitioner filed the above insolvency petition against the respondents praying the Honorable Court to declare him as insolvent. It is therefore informed to all the respondents that the above case is posted to **18-10-2024** and as such you are informed to attend before the Honorable Court on that day at **10.30 A.M** otherwise you will set exparte.

D. Vijaykumar & K.Satish Babu
Advocates, Vizianagaram
Ph: 7989485035